ప్రజాశక్తి

సోమవారం 30 జనవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నేడే ఉక్కు ప్రజా గర్జన

- భారీగా తరలిరానున్న ప్రజానీకం
- హాజరుకానున్న రాజకీయ పార్టీల రాష్ట్ర నేతలు
- త్రిష్ణా మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- వాహనాల పార్కింగ్‌కు పలు ప్రాంతాలు కేటాయింపు

ఏర్పాట్లు పరిశీలనలో ఉక్కు నేతలు

ప్రజాశక్తి - ఉక్కునగరం

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రంలోని మోడీ సర్కారుతో అమీతుమీ తేల్చుకోవడానికి స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం సిద్ధమైంది. ఈ క్రమంలోనే పోరాట పంథాను, స్వరూపాన్ని మార్చింది. సోమవారం ఉక్కు నగరంలోని త్రిష్ణా మైదానంలో సాయంత్రం 3 గంటలకు 'ఉక్కు ప్రజా గర్జన' పేరుతో భారీ సభను నిర్వహించేందుకు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సిద్ధమైంది. మరోపక్క విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి కూడా ఈ గర్జన సభను విజయవంతం చేయడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ మేరకు రాజకీయ పార్టీల నాయకులందరికీ ఆహ్వానాలు వెళ్లాయి. ఉక్కు ప్రజా గర్జన బహిరంగ సభలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల (బిజెపి మినహా)కు చెందిన రాష్ట్ర నాయకులు పాల్గొన నున్నారు.

భారీ ఎత్తున ఏర్పాట్లు

ఉక్కు ప్రజా గర్జన సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. పోరాట కమిటీ నాయకులు ఆదివారం దగ్గరుండి ఏర్పాట్లును పర్యవేక్షించారు. త్రిష్ణా గ్రౌండ్‌కు వేలాదిగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పలు సూచనలు చేశారు. కుర్చీలు, మిగతా 2లో..

అగనంపూడిలో ప్రచార పాదయాత్ర చేపడుతున్న నాయకులు

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

ఇష్టమైన నేత బివి.రాఘవులు

- ప్రజ్ఞ, ఎస్‌విఎస్ కళాశాలల ఫేర్‌వెల్ ఫంక్షన్‌లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ప్రజాశక్తి - ఎస్.రాయవరం

తనకు రాజకీయాల్లో సిపిఎం నేత బివి.రాఘవులు అంటే ఎంతో ఇష్టమని, జాతీయ ప్రముఖుల్లో స్వామి వివేకానంద అంటే అభిమానమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. ఆదివారం అడ్డురోడ్డులోని శ్రీ ప్రజ్ఞ జూనియర్ కాలేజీ, ఎస్‌విఎస్ డిగ్రీ కాలేజీ ఫేర్‌వెల్ ఫంక్షన్ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన్ని పలువురు విద్యార్థులు ప్రశ్నలు అడిగారు. వాటికి తనదైన శైలిలో ఆయన సమాధానమిచ్చారు. ఉద్యోగంలో కంటే రాజకీయ జీవితంలోనే ప్రజా సేవచేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. తాను రాజకీయాల్లోకి రావడానికి కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆశయాలే కారణమన్నారు. ఆయన ప్రోద్బలంతోనే రాజకీయ ప్రవేశం చేశానన్నారు. రాజకీయంలోకి వచ్చాక తన కుటుంబం కంటే ప్రజలే కుటుంబమని భావించానన్నారు. మూడుసార్లు గెలిచినా మంత్రి పదవి రాలేదని, అయినా ఎక్కడా నిరాశ పడలేదని, అవకాశాలు అందరికీ అంత తొందరగా రావని అన్నారు. ఉన్న అవకాశాలను సద్వినియోగ పరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. నాయకులుగా ఎదగాలంటే ధనం ముఖ్యం కాదన్నారు. పేదలకు మిగతా 2లో..

లోపలి పేజీల్లో..

నిర్వాసితుల సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం

సమస్యలపై చేతి వృత్తిదారుల ధర్నా

పోర్టుల ప్రయివేటీకరణను అడ్డుకోవాలి

చెరువులకు ఎసరు

ఒబెరాయ్ గ్రూపు నిర్వాహకులకు స్థల వివరాలు తెలియజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

అన్నవరంలో ఒబెరాయ్ సంస్థకు..

40 ఎకరాలు కేటాయింపు

ప్రజాశక్తి - భీమునిపట్నం : మండలంలోని అన్నవరం గ్రామ పంచాయతీ వద్ద ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకుగల 40 ఎకరాల స్థలాన్ని ఒబెరాయ్ గ్రూప్ కంపెనీకి లీజ్ కమ్ రెంట్ ప్రాతిపదికన కేటాయించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆదివారం సదరు స్థలాన్ని ఒబెరాయ్ గ్రూప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి విక్రమ్ ఒబెరాయ్, సంస్థ కార్పొరేట్ వ్యవహారాల అధ్యక్షులు రాజారామన్ శంకర్, ముఖ్య ఆర్థిక నిర్వహణాధికారి శ్రీ కల్లోల్ కుందులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగ పరంగా విశాఖపట్నం ప్రాధాన్యతను, రాబోయే కాలంలో విశాఖలో చేపట్టనున్న మిగతా 2లో..

యూనివర్సిటీల్లో ఎయు టాప్

- ఇక్కడ చేరితే ఉద్యోగం గ్యారెంటీ అన్న భావన విద్యార్థుల్లో బలపడింది
- ఈ విద్యా సంవత్సరంలో పీజీలో వంద శాతం ప్రవేశాలు
- యూనివర్సిటీలో విభాగాలను ఆధునికీకరిస్తున్నాం
- 'ప్రజాశక్తి'తో ఎయు విసి ప్రొఫెసర్ పివిజిడి.ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయాల్లో ఆంధ్రా యూనివర్సిటీ ఒకటి. 1926లో విశాఖ సాగర తీరానికి సమీపంలో ఏర్పాటై ఎంతో మందికి ఉన్నత విద్యనందించడమే కాకుండా దేశంలోనే అనేక రంగాల్లో ప్రాచుర్యం పొందిన వారికి ఇదో సార్వత్రిక విద్యా కేంద్రంగా పేరుగాంచింది. తాజా విద్యా సంవత్సరంలో 21 స్టేట్ యూనివర్సిటీల్లో పీజీ అడ్మిషన్లలో టాప్ -1 స్థానం దక్కించుకుంది' అని ఆంధ్రా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. యూనివర్సిటీ ప్రాంగణ సముదాయాలకు క్రొంగొత్త సొబగులు అద్దుతూ అభివృద్ధి పరిచే కృషిలో ఆయా విభాగాలను ఆధునికీకరించడం, ఖాళీ ప్రదేశాలను సైతం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నట్టు ఆయన తెలిపారు. ఎయులో చేపడుతున్న పనులు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను 'ప్రజాశక్తి'కి ఆయన తెలియజేశారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

ఎయు విద్యా వాతావరణంలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి.. వాటి గురించి వివరించండి ?

రాష్ట్రంలో 21 స్టేట్ యూనివర్సిటీల్లో ఎయు ఈ ఏడాది పీజీ అడ్మిషన్లలో వంద శాతం ప్రవేశాలతో టాప్ 1లో నిలిచింది. వెబ్ ఆప్షన్లలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నేడే ఉక్కు ప్రజా గర్జన

మంచినీరు, వాహనాల పార్కింగ్ పక్కగా ఉండాలని సూచించారు. బహిరంగ సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు. తెలుగు తల్లి విగ్రహం నుంచి వచ్చే వాహనాలను డివిఐ స్కూల్ నుంచి టౌన్ అడ్మిన్ బిల్డింగ్ వైపునకు మళ్లిస్తామని అన్నారు. అగనంపూడి నుంచి స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్ మీదుగా వచ్చే వాహనాలను సెక్టార్ 6 కాంప్లెక్స్ నుంచి విశాఖ విమల విద్యాలయం వరకూ, ఉక్కునగరం జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను హాస్టల్ బస్‌స్టాప్ నుంచి సత్య సాయిబాబా ఆలయం వరకు అనుమతించనున్నట్లు వెల్లడించారు. వెంకటేశ్వర స్వామి ఆలయం, కేంద్రీయ విద్యాలయం నుంచి వాహనాలకు, సెక్టార్ ఫైవ్ షాపింగ్ కాంప్లెక్స్ నుంచి జ్యోతి బాలవిహార్ రోడ్డు మార్గంలో వచ్చే వాహనాలకు, ఆగ్రో ఫారెస్ట్ రోడ్డు సెక్టార్ 1 మీదుగా వచ్చే వాహనాలకు హాస్టల్ బస్ స్టాప్ - సెక్టార్ 4 రోడ్డులో నిలపడానికి పార్కింగ్ స్థలాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

తరలిరానున్న రాజకీయ నేతలు

గర్జన సభకు వైసిపి నుంచి టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి రానున్నారు. టిడిపి నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెంనాయుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొంటారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జనసేన రాష్ట్ర నాయకులు నాదెండ్ల మనోహర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాకేష్ రెడ్డి, తదితరులు హాజరుకానున్నట్లు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ తెలిపింది.

వాడవాడలా ప్రచారం

సోమవారం జరిగే ఉక్కు ప్రజా గర్జన సభను విజయవంతం చేయాలని నిర్వాసిత ప్రాంతాల్లో ఆదివారం ప్రచారం హోరెత్తింది. కార్మిక నేతలు పాదయాత్ర చేపట్టారు. వారు ఇప్పటికే పెదగంట్యాడ, గంగవరం, వడ్లపూడి తదితర ప్రాంతాల్లో 15 రోజులుగా నిర్విరామంగా ప్రచారం చేస్తూ వచ్చారు. ఆదివారం కూడా అగనంపూడి నిర్వాసిత ప్రాంతంలో పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరాం ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు. స్థానిక జనసేన నేతలు మద్దతుగా నిలిచి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్రజా సంపదను కాపాడుకోవడానికి చేస్తున్న ఈ పోరాటం చారిత్రాత్మకమైనదని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలను ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాన్ని ప్రజలు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇల్లపు ప్రసాద్, గవర సోమ శేఖర్, నీలకంఠం, గోవింద, పైడిరాజు, ఎం.వెంకటరమణ, అట్టా అప్పారావు పాల్గొన్నారు. అలాగే ఉక్కునగరంలోనూ, పలు నిర్వాసిత కాలనీల్లోనూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. ప్రజలు ఎక్కడికక్కడ మద్దతు తెలిపారు.

యూనివర్సిటీల్లో ఎయు టాప్

ఎయునే పలువురు విద్యార్థులు ఎంపిక చేసుకోవడం యూనివర్సిటీలో విద్యా వాతావరణం ఎలా ఉందో తెలియజేస్తుంది. ఇక్కడ చేరితే ఉద్యోగం గ్యారెంటీ అన్న భావన విద్యార్థి నుంచి మరో విద్యార్థికి నోటి మాట ద్వారా పాకింది. వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకుని జాయిన్ అవుతున్నారు. సైన్స్ పీజీ విభాగంలో 1249 ఖాళీలుంటే అన్నీ నిండిపోయాయి. పోస్టు గ్రాడ్యుయేషన్ ఆర్ట్స్ విభాగంలో 980 సీట్లకు 940 అంటే 99శాతం పూర్తయ్యాయి. ఒకప్పుడు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాలకే పరిమితమైన ఎయులో రాయలసీమ ప్రాంతంలోని కడప, చిత్తూరు, కర్నూలు, అలాగే ప్రకాశం, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పీజీ అడ్మిషన్లలో చేరారు. రాష్ట్రంలో ఎస్‌వి లాంటి యూనివర్సిటీలున్నా సరే ఎయు ఒక్కటే వంద శాతం ప్రవేశాల మైలురాయిని దాటింది.

యూనివర్సిటీలో రెండు, మూడు విభాగాలను తరలించారన్న ప్రచారంలో వాస్తవమెంత ?

యూనివర్సిటీ ప్రాంగణాన్ని దాతల సాయంతో అభివృద్ధి చేస్తున్నాం. ప్రభుత్వం, యూనివర్సిటీ నిధుల నుంచి ఒక్కపైసా వినియోగించడం లేదు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఒక విజన్‌తో ముందుకు సాగుతున్నాం. రాజధాని గురించి ఏం చర్చ జరుగుతుందో నా దృష్టిలో లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా సరళిని బట్టి విద్యా సంస్థలు, యూనివర్సిటీల్లో ఒక్క అంగుళం కూడా రాజధాని కోసం తీసుకోవ్వన్నది కఠోర సత్యం. యూనివర్సిటీలోగల విద్యాభవన్‌లోని సంస్కృతి, ఎడ్యుకేషన్ విభాగాలను మూడు నెలల క్రితం ఎదురుగా ఉండే ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలోకి తరలించాం. ఆ భవనం నిర్మాణం జరిగి 40 ఏళ్లవుతోంది. ఆధునీకరణ కోసం ముందు చెప్పినట్లు రూ.40 లక్షల దాతల నిధులతో భవన సముదాయాన్నంతటినీ కొత్త హంగులతో తీర్చిదిద్ది 'విద్యాతరంగిణి' అని పేరు పెట్టి 300 మంది ఎయు ఉమెన్స్‌కు వసతిగృహంగా మార్చాం. తరలింపు రాజధాని కోసం కాదు.. ఆధునీకరణ కోసం చేశాం. ఆ రెండు విభాగాల్లో గడచిన పదేళ్లలో విద్యార్థుల సంఖ్య సంస్కృతంలో 50 మంది ఒక ఫాకల్టీతోనూ, ఎడ్యుకేషన్‌లో 200 మంది ముగ్గురు ఫ్యాకల్టీలతో నడిచింది. ఈ రెండు విభాగాలను ఖాళీ చేయించి వేరొక చోటకు మార్చాం.

ఎయు ఛాన్సలర్‌గా మీరెలా పిలవబడుతున్నారు ?

ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా భవిష్యత్తు తరం గుర్తుంచుకునే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలనుకున్నాను. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాను. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో విద్యా వాతావరణం కాపాడడం, అత్యధిక మంది ప్లేస్‌మెంట్లు సాధించడంలో సఫలీకృతం అయ్యాను. కావాలనుకుంటే రాష్ట్ర స్థాయిలో చాలా ఉన్నత స్థానాలకు వెళ్లేవాడిని. కానీ నా లక్ష్యం అది కాదు. ఇక్కడే చదువుకుని ఈ ప్రాంగణాన్ని తీర్చిదిద్దే అవకాశం లభించడం నిజంగా అదృష్టం. యూనివర్సిటీ అభివృద్ధి, ప్రాంగణాల ఆధునీకరణ, విద్యార్థుల సంక్షేమం కోసం కృషిని కొనసాగిస్తాను. నా టర్మ్ అయిపోయాక నేను విశాఖలో తిరిగే క్రమంలో ఏ ఒక్కరూ వేలెత్తి నా వైపు చూపించేలాగ ఏ పనీ చేయలేదు. నా భవిష్యత్తు కార్యాచరణ కూడా అలా ఉండదు.

40 ఎకరాలు కేటాయింపు

పలు ప్రభుత్వ ప్రాజెక్టులను గురించి ఒబెరాయ్ సంస్థ నిర్వాహకులకు వివరించారు. కార్యక్రమంలో ఎపి పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మల్ రెడ్డి, పర్యాటక శాఖ రీజనల్ డైరక్టర్ శ్రీనివాస్ పాణి, భీమిలి ఆర్‌డిఓ భాస్కర్‌రెడ్డి, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇష్టమైన నేత బివి.రాఘవులు

మంచి చేసే లక్షణాలుండాలన్నారు. రాజకీయం మంచిదేగానీ నాయకులు మంచివారుగా ఉండడం లేదన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని నమ్మి రాజకీయాల్లోకి తాను వచ్చానన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు శీలమంతుల వీరభద్రరావు, చైర్మన్ ఆదిత్య, ప్రిన్సిపాల్ రాపర్తి రాము, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'మారాల్సింది నాయకులు కాదు.. ప్రజలు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాజధానుల అజెండా అంశంపై వైసిపి పోటీ చేయాలని, అంతవరకూ మూడు రాజధానుల అవసరంపై మాట్లాడకూడదని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జెఎసి కన్వీనర్ ప్రియాంక దండి అన్నారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 'మారాల్సింది నాయకులు కాదు..ప్రజలు' పేరిట ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రాజధానుల అజెండాకు అనుకూలంగా ప్రజా తీర్పు ఉంటే దానిని అమలు చేయడానికి వైసిపి ముందుకు వెళ్లవచ్చునన్నారు. తినే తిండి దగ్గర నుంచి బట్టలు, పాదరక్షలు అన్నిటిలోనూ నాణ్యతను చూసే మనిషి పాలించే నాయకుల విషయంలో మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదన్నారు. ఫలితంగా కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్వాతంత్రోద్యమంలో కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా కలిసి ఉద్యమం చేయడం వల్లే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, ప్రజల నిర్ణయాలతో చట్టాలు చేస్తే అది ప్రజాస్వామ్యం అవుతుందని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా ముందుకు వెళ్లడమంటే ప్రజాస్వామ్యాన్ని అగౌరవ పరచడమేనన్నారు. జెఎసి కార్యనిర్వాహక కార్యదర్శి జగన్ మురారి మాట్లాడుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ చిన్న రాష్ట్రం అయిపోయిందని, ఇంకో మూడు ముక్కలైతే దేశంలో తెలుగువారి ఐక్యత తగ్గుతుందని అన్నారు. తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడం చేతగాక కొంతమంది ప్రత్యేక రాష్ట్రాల వాదనలను ముందుకుతెచ్చి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్యాకేజీ, రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అంశాల పట్ల పోరాటం చేయడంపై దృష్టి పెట్టాలని మంత్రి ధర్మాన ప్రసాదరావుకు సూచించారు. కార్యక్రమంలో ఎపి నిరుద్యోగ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత్ కుమార్, ఎపి పరిరక్షణ జెఎసి సభ్యులు నొల్లు నాగరాజు, నాగేశ్వరరావు, నాగేంద్ర, హర్ష, శ్రీకృష్ణ, రాజేశ్వరరావు, కార్తీక్ పాల్గొన్నారు

668వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

దీక్షల్లో కూర్చున్న టిఎన్‌టియుసి నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయరాదని గర్జిస్తూ సోమవారం స్టీల్‌ప్లాంట్‌లో లక్షలాది మందితో ప్రజా గర్జన జరగనుందని, దీనిని చూశాక స్టీల్‌ప్లాంట్‌ను కొనుగోలు చేయాలని ముందుకు వచ్చే పెట్టుబడిదారులు వెనక్కి వెళ్లక తప్పదని టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారానికి 668వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతికి, విశాఖ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్న ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందామన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. విశాఖ అభివృద్ధిని కుంటుపడేలా చేయాలని, రిజర్వేషన్లను తుంగలోకి తొక్కాలని ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు కొనసాగితేనే శాశ్వత ఉద్యోగాలు వస్తాయన్నారు. దీక్షల్లో ఎం.ఎస్.కృష్ణ, సత్రబాయిన చినఅప్పారావు, పీలా సుబ్బారావు, నంబాల సత్యనారాయణ, ఇలిపిల్లి అప్పారావు, పి.గణపతి, పెద్దాడ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం 27వ వార్డు పరిధిలోని అశోక్ నగర్‌కు చెందిన పెద్దాడ ముఖేష్ (ఆదినారాయణ) కుటుంబానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆర్థిక సాయం అందించారు. వైసిపి కార్యకర్తగా ఉన్న ముఖేష్ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆదివారం మరణించారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గణేష్ కుమార్ అశోక్‌నగర్ వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. దహన ఖర్చుల నిమిత్తం అతని కుటుంబ సభ్యులకు తన సొంత నిధుల నుంచి రూ.10 వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. ముఖేష్ ఈ ప్రాంతంలోని ఎస్‌సి కుల పెద్ద పెద్దాడ అప్పారావు కుమారుడు. కార్యక్రమంలో వైసిపి 27వ వార్డు అధ్యక్షులు నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈతలపాక విజయ్, మధు ఉన్నారు.

అప్పన్న అనుబంధ ఆలయాల్లో భీష్మ ఏకాదశి కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి-సింహాచలం : సింహాచల దేవస్థానం అనుబంధ దేవాలయాలైన కొండపైన త్రిపురాంతక స్వామి ఆలయంలో, కొండ దిగువ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, మాధవస్వామి వేణుగోపాలస్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ఆయా ఆలయాల్లో నిర్వహించే కల్యాణోత్సవాలను వీక్షించాలని కోరారు.

వైభవంగా మోదకొండమ్మ తీర్థం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు మోదకొండమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది.

నిందితుని ఆచూకీ చెబితే నజరానా

నిందితుడు రమేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2012లో నమోదైన ఓ కేసులో నిందితుని వివరాలు తెలియజేస్తే తగిన పారితోషికం ఇస్తామని విశాఖ సమీపంలోని కొత్తవలస పోలీసులు తెలిపారు. వైశ్యరాజు రమేష్ అలియాస్ దశరథి కొత్తవలస పోలీస్ స్టేషన్‌లో సిఆర్ నెంబర్ 144/2012 కేసులో ముద్దాయిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎస్.కోట కోర్టుకు ఎప్పటి నుంచో హాజరుకాకపోవడంతో ప్రొక్లమేషన్ పెండింగ్‌లో ఉందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE, VISAKHAPATNAM
O.S.474/2014

Between:
Smt.Lata Kishan Chand and 2 others ...PLAINTIFFS
And:
Mallakanti Malyadri & 15 others ...DEFENDANTS

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To:
Defendant-11:- Smt.Mallakanti Suhasini, Hindu, Aged around 44 years, wife of M.Malyadri, Flat No.101, Door No. 7-22-5/B, Uma Residency, Kirlampudi Layout,China Waltair, VISAKHAPATNAM 530017.

Please take notice that in the above suit, the Honourable court ordered summons to you by way of paper publication in this newspaper. You are, therefore, hereby ordered to appear either in person or through a duly instructed advocate on **06-2-2023 at 10-30 AM** in the above court. Please take further notice that in the absence of your appearance as stated above, the matter will be heard ex-parte.

HEARING DATE:06-2-2023 AT 10-30 AM
(BY ORDER OF THE COURT)

K.RAVI,
ADVOCATE FOR PLAITIFFS
49-53-7/14,
BALAYYA SASTRY LAYOUT
VISAKHAPATNAM 530013
VISAKHAPATNAM
DT.30-1-2023

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో: పిఠాపురం
O.S. No. 72/2019

Between:
కెనరా బ్యాంక్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, తుని బ్రాంచ్, తుని. ...వాది
మరియు
జి.వి.యస్. సీడ్స్, ఈదటం రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రయిటర్ **గణపతిరాజు వెంకట సుబ్బరాజు**, S/o. రామకృష్ణరాజు, ఈదటం గ్రామం, పాయకరావుపేట మండలం, విశాఖ జిల్లా. ...ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాదియైన మీకు ఎన్నిమార్లు కోర్టువారు నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్న కారణంగా కోర్టువారి అనుమతిని, పత్రికా పూర్వకముగా తెలియచేయునది ఏమనగా పై దావా మీ హాజరు నిమిత్తం **ది. 02-02-2023**కు వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదాకు పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు **ది. 02-02-2023న ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరు అయి ఆక్షేపణలుంటే తెలియచేసుకోవలెను. అట్లు కాని యెడల దావా మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియచేయడమైనది.

పడాల రవి, అడ్వకేట్
పిఠాపురం. పిఠాపురం. తూ॥గో॥జిల్లా.
తేది:28-1-2023 సెల్: 98480 11614

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE, AT ANAKAPALLE
O.S.226 of 2014.

Between:-
Sanivada Vara Lakshmi **...Plaintiff**
And
Lanka Apparao and others.
...Defendants.

To,
1. Lanka Apparao son of late Appanna, Hindu, aged about 75 years, cultivation, residing at Quarter No.19, State Bank Quarters, Sarada Nagar, Kothuru Village, Anakapalle Mandal, Visakhapatnam District.
2. Lanka Siva Surya Eswara Naga Sathyanarayana @ Prasad son of Apparao, Hindu, aged about 38 years, residing at rest do.
3. Bandi Sri Lakshmi wife of Suribabu, Hindu, aged about 34 years, Housewife, residing at rest do.

Suit Summons

The Plaintiff has filed the above suit for partition of the suit and for other reliefs and the above suit stands posted to **dt.3-2-2023** for your appearance. Hence you are here by directed to appear either personally or through your counsel on that day before the above court, and if you fail to appear on or before **10.30 A.M. on DT.03-02-2023** the matter will be proceeded in your absence.

P.A.Narasimham,
Anakapalle Advocate, Anakapalle.
Dt.29-1-2023. 92466 33373.

చెరువులకు ఎసరు

1బిలో ప్రయివేటు వ్యక్తుల పేర్లు - రైతుల ఆందోళన

పద్మనాభం మండలం పొట్నూరులోని గవర్రాజు చెరువు

ప్రజాశక్తి-పద్మనాభం : జిల్లా, మండల కేంద్రాల్లో మాత్రమే కనిపించే భూకబ్జాలు ఇటీవల కాలంలో గ్రామాలకూ పాకింది. పద్మనాభం మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఉన్న యాతవాని చెరువు, పొట్నూరు గ్రామంలో ఉన్న గవర్రాజు చెరువులపై కబ్జాదారుల కన్నుపడింది. అంతే ఆ చెరువులు ఇప్పుడు ప్రయివేటు వ్యక్తుల పేరుపై కనిపిస్తున్నాయి. 1బి లో ప్రయివేటు వ్యక్తుల పేర్లు కనబడటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

పద్మనాభం మండలం పొట్నూరు గ్రామ రెవెన్యూలో 1956కు ముందు సర్వే నెంబర్ 107లో గవర్రాజు చెరువు 19 ఎకరాల 56 సెంట్లు విస్తీర్ణంగా రికార్డుల్లో ఉంది. 1956లో ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర భూసర్వేలో ఆ గ్రామానికి చెందిన పెద్ద రైతు కిల్లారి రామూర్తినాయుడు పేరుమీద ఆ చెరువును అప్పటి కరణంగా ఉన్న తిరుపతిరావు నమోదు చేశారు. దీనిపై కొంత మంది రైతులు భీమిలి మునసబు కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ చెరువు తమది అని ఎవరూ రాలేదు. ఈ చెరువు విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను కలుపుకొని 107 సర్వే నెంబరు సరిహద్దుగా ఉంది. ఈ చెరువు కింద విజయనగరం జిల్లా జామి మండలం కుమరాం గ్రామానికి 300 ఎకరాలను రైతులు సాగుచేస్తున్నారు. పూర్తిగా వ్యవసాయ ఆధారితంగా జీవనోపాధి పొందిన 150 కుటుంబాలు పూర్వం నుంచి పంటలు పండించుకుంటున్నాయి. మూడేళ్లుగా ఇదే చెరువులో గ్రామస్తులు ఉపాధి హామీ పథకం పనులు కూడా చేస్తున్నారు. ఈ చెరువుకు సాగునీరు సౌకర్యం లేదు. వర్షం పడితేనే నీరు నిండి పంటలు పండుతాయి. ఇటువంటి చెరువులో 2022 డిశంబర్ 21న విశాఖపట్నంకు చెందిన మంచుకొండ వెంకటజగన్నాథం పేరిట మారినట్లు కనిపిస్తోంది. 20 రోజులు క్రితం గవర్రాజు చెరువు సర్వేనెంబర్ 107లో పది ఎకరాలు, సర్వే నెంబర్ 106-1లో మెట్టు జిరాయితీలో కూడా పది ఎకరాలు తమ పేరు మీద ఉందని డిసెంబర్‌లో కొందరు వ్యక్తులు సర్వే చేపట్టారు. దీన్ని గమనించిన రైతులు అడ్డుకోవడంతో వెళ్లిపోయారు. దీనిపై రైతులు ఆరా తీశారు. ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించారు. అందులో 1బిలో చెరువుకు బదులు మంచుకొండ వెంకటజగన్నాథం పేరు కనిపించింది. దీనిపై పద్మనాభం తహశీల్దార్‌కు ఈ నెల 20న రైతులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన జంకల రవి, జంకల సన్యాస్యుడు, జంకల అప్పలనాయుడు, కోళ్ల అప్పలనాయుడుకు ఆక్రమణదారుడు నోటీసులు ఇచ్చాడు. ఇది జరగడానికి రెండు నెలల ముందు కుమరాం గ్రామానికి చెందిన సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి భర్త రవికుమార్ ఆక్రమణకు పాల్పడ్డాడు. ఇటువంటి పనులు చేయడానికా సర్పంచ్ పదవిని కట్టబెట్టామని గ్రామస్తులు నిలదీయడంతో చెరువుకు సంబంధించిన కార్యక్రమాల్లో జోక్యం చేసుకోనని సర్పంచ్ భర్త ప్రమాణం చేశారని రైతులు చెప్పారు.

జీవనోపాధి పోతుంది

గవర్రాజు చెరువు కింద తాత తండ్రుల నుంచి 0.40 సెంట్లు భూమి ఉంది. నా కుటుంబం దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తోంది. ఈ చెరువు ఆక్రమణకు గురైతే మా జీవనోపాధి పోయి కుటుంబం రోడ్డున పడుతుంది.

జంకల రమణ
రైతు

చెరువు ద్వారా పశుపోషణ

నాకు 0.70 సెంట్లు భూమి ఉంది. పూర్వం నుంచి రకరకాల పంటలు వేసుకొని జీవనోపాధి సాగిస్తున్నాం. ఈ చెరువు ఆధారంగా పశుపోషణ చేసుకుంటున్నాం. చెరువు ఆక్రమణకు గురైతే జీవనోపాధి కష్టం.

ఇప్పిల రామునాయుడు
రైతు

గ్రామం విడిచి వెళ్లలేం

నేను, నా కుటుంబం గ్రామం విడిచి వెళ్లేని స్థితిలో ఉన్నాం. పొలం పండితేనే మాకు జీవనోపాధి సాగుతుంది. గ్రామానికి ప్రధాన చెరువుగా ఉంది. దీని ఆధారంగా 150 రైతు కుటుంబాలు జీవిస్తున్నాయి. చెరువు ఆక్రమణపై రైతులందరమూ కలిసి పోరాడి తీరుతాం.

కోళ్ల శ్రీను
రైతు

నేరాలు ఘోరాలు

చెట్టును ఢీకొన్న వ్యాన్ : డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో అడ్డూరు గ్రామం వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ఎలమంచిలి మండలం గొల్లల పాలెం గ్రామానికి చెందిన వ్యాన్‌డ్రైవర్ కోన ప్రేమ్‌కుమార్ (26). కోళ్లలోడుతో వడ్డాది వైపు నుంచి సబ్బవరం వెళుతుండగా, అడ్డూరు గ్రామం వద్ద ప్రమాదవశాత్తు మర్రిచెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్‌డ్రైవర్ ప్రేమ్‌కుమార్ కేబిన్‌లో ఇరుక్కుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు.

మానసిక ఆసుపత్రి నుంచి ఇద్దరు మహిళలు అదృశ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి చిన్న వాల్తేరులో ఉన్న ప్రభుత్వ మానసిక ఆసుపత్రి నుంచి ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. దీనికి సంబంధించి మూడో పట్టణ పోలీసులు లుకౌట్ నోటీసు జారీ చేశారు. కోనసీమ అంబేద్కర్ జిల్లాకు చెందిన మూల ధనలక్ష్మి, ఆమె తల్లి మణికుమారి వైద్యం నిమిత్తం విశాఖపట్నం మానసిక ఆసుపత్రికి కొంతకాలం క్రితం వచ్చారు. వీరి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో గత ఏడాది నవంబర్ 3న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే వారు ఇంటికి చేరలేదని వారి బంధువైన పల్లి రాంబాబు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఆచూకీ తెలిసినవారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లోని 9440796011, 9989411511, 0891-275517 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ చంద్రకళ

'ఫ్రెండ్స్' సొసైటీ సేవలు ప్రశంసనీయం : డిఇఒ

ప్రజాశక్తి -తగరపువలస : ఎన్ఎంఎంఎస్ లాంగ్ టర్మ్ శిక్షణా తరగతులు ఉచితంగా నిర్వహించిన ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని డిఇఒ ఎల్.చంద్రకళ కొనియాడారు. సొసైటీ ఆధ్వర్యాన గత 5 నెలలుగా నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఇఒ హాజరై మాట్లాడారు. సుమారు 120 మంది విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన ఉపాధ్యాయులు పక్కి నాగేశ్వరరావును ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షులు గంటాన మోహనరావు, చిట్టివలస, చిప్పాద జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎంలు పొట్నూరు మురళీమోహన్‌రావు, రెడ్డి అప్పారావు, ఉపాధ్యాయులు రమణ, విజయ్ కుమార్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆదివారం టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఆరిమండ వరప్రసాదరెడ్డి, డాక్టర్ విజయసారధిరెడ్డి దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

ఘనంగా అనాథ చిన్నారుల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరానగర్‌లోని ఆనందమార్గ్ ఆశ్రమంలో ఉన్న ఐదుగురు అనాథ చిన్నారుల జన్మదిన వేడుకలను మార్వారీ యూత్ సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో గల 40 మంది పిల్లలకు దుస్తులు, మిఠాయిలు పంచి పెట్టారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకొని చిన్నారులతో నృత్యాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సౌమ్యానంద అవధూత, ఆచార్య ఇష్ట ప్రేమానంద అవధూత, వసుంధరానంద అవధూత, మార్వారీ యూత్ సభ్యులు ఖందవాల్, సంజయ్ అగర్వాల్, అనూజ, భూపన్ ఖమ్మా, అతుల్, గంభీర్ అగర్వాల్ పాల్గొన్నారు.

చట్ట సభల్లో సముచిత స్థానం దక్కేలా కృషి

ప్రజాశక్తి -భీమునిపట్నం : చట్ట సభల్లో సముచిత స్థానం దక్కేలా మనమంతా కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందని విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల కొండ సూర్యాచార్య అన్నారు. స్థానిక విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు యానాపు శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సూర్యాచార్య మాట్లాడుతూ, స్వర్ణకారులు, కంసాలి, కార్పెంటర్లు, కమ్మరి, శిల్పులు ఒకే తాటిపైకి వచ్చి సమస్యలపై గళం ఎత్తాలని పిలుపునిచ్చారు. గత కాలపు కుల వృత్తులు నేటి జీవనానికి ఏ మాత్రం ఉపయోగకరంగా లేవని, ఉన్నత విద్య మాత్రమే ఉన్నత స్థితికి చేరుస్తుందని నొక్కి చెప్పారు. విద్య, ఉద్యోగం కోసం ఆర్థికంగా వెనుకబడిన వారికి సంఘం పరంగా శక్తి మేరకు ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోడి అరుణ, జిల్లా కమిటీ సభ్యులు కందిపల్లి శ్రీనివాస్, ఆవుపాటి శంకర్, దార్ల హరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు గండిబోయిన పోలిరాజు తదితరులు పాల్గొన్నారు. కె.సన్యాసిరావును సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించే పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి మాతా గోవింద మాంబ శాంతి కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని సమావేశంలో నిర్వాహకులు కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాచార్య

లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్న అప్పలస్వామినాయుడు, రమణ

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

ప్రజాశక్తి- ఆనందపురం : ప్రధాన మంత్రి ఉజ్వల భారత్ గ్యాస్ పథకం కింద మంజూరైన గ్యాస్ కనెక్షన్లను వేములవలస, లొడగలవానిపాలెం గ్రామపంచాయతీల్లో పంపిణీ చేశారు. వేములవలసలో 21మందికి, లొడగలవానిపాలెంలో 30 మందికి వేములవలస సచివాలయం వద్ద మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామి నాయుడు, లొడగల రమణ అందజేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు భారతి, తేజ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిలో ట్రైబల్ యూత్ ఫెస్ట్

ట్రైబల్ యూత్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి -మధురవాడ : నెహ్రూ యువ కేంద్రం, భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ కళాశాల్లో ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ మాట్లాడుతూ, యువత స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ట్రైబల్ యూత్ ఎక్స్చేంజ్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బస్తర్, కంకేర్, నారాయణపూర్, రాజ్‌నందగావ్ జిల్లాలు, జార్ఖండ్ రాష్ట్రంలోని గుమ్లా, కుంటి, లోహార్‌దగా, లతేహార్ జిల్లాలు, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి సుమారు 200 మంది గిరిజన యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎ.ఆర్.విజయరావు, ఆశకుమారి, సిఆర్‌పిఎఫ్ 198వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ హాజరయ్యారు.

స్విమ్మింగ్ పూల్ పూర్తయ్యేనా?

జివిఎంసి నిధులు రూ.25 లక్షలు నేలపాలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి వికాస్‌నగర్‌లో 2000 గజాల స్థలంలో స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటుకోసం 2008వ సంవత్సరంలో శంకుస్థాపన చేశారు. జివిఎంసి పాలకవర్గం రూ.25 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి సగం పూర్తయ్యాక నిధులు చాలవని చేతులెత్తేశారు. దీంతో అప్పటి నుంచి ఆ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ ప్రాంతంలో తుప్పలు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. పాములకు నిలయంగా మారింది. ఆకతాయిలు స్విమ్మింగ్ పూల్ గేట్లను విరగ్గొట్టారు. ఆ ప్రాంతం రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా తయారైంది. దీంతో సమీపంలో నివాసమంటున్న గృహ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందుబాబుల చేష్టలతో స్థానికులు విసిగిపోతున్నారు. ఇళ్లు ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోవాలనిపిస్తోందని, సొంతిల్లు వదులుకోలేక, మందుబాబులతో వేగలేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్థానిక న్యూపోర్టు పోలీసులు రాత్రి సమయంలో గస్తీ తిరిగిన సందర్భాలు కనిపించకపోవడంతో మందుబాబులు మరింత రెచ్చిపోతున్నారు. ఈ స్విమ్మింగ్ పూల్ వినియోగంలోకి వస్తే స్థానికంగా ఉన్న యువకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావించినా నిరాశే మిగిలింది. ఇప్పటికైనా జివిఎంసి అధికారులు స్పందించి ఈ స్విమ్మింగ్‌పూల్‌ను వినియోగం తేవాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తిగా నిలిచిన స్విమ్మింగ్ పూల్ పనులు

సంతకాలు సేకరిస్తున్న స్టీల్‌ప్లాంట్ నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి-మాధవధార : స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం మాధవధార ప్రాంతంలో సిఐటియు నాయకులు కూన వెంకట్రావు ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లాభాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వల్ల ఎంతోమంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, ప్రయివేటుపరం అయితే వారంతా రోడ్డున పడతారని తెలిపారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో మాధవధారలో ఉంటున్న స్టీల్‌ప్లాంట్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మసేను

పోర్టుల ప్రయివేటీకరణను అడ్డుకోవాలి

ప్రజాశక్తి- మాధవధార : పోర్టుల ప్రయివేటీకరణను అడ్డుకోవాలని విశాఖపట్నం పోర్టు ట్రస్టు మాజీ సభ్యులు బిసిహెచ్ మసేను కోరారు. హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ వనభోజన కార్యక్రమం మాధవధార తోటలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిసిహెచ్.మసేను ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల సొమ్ముతో ఏర్పాటైన ప్రభుత్వ పరిశ్రమలను గుజరాత్ కార్పొరేట్ సంస్థలకు మోడీ తెగ నమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్‌దారులకు ఆసుపత్రి సౌకర్యాలను ప్రయివేటుపరం చేస్తున్నారని తెలిపారు. మోడీ పాలనతో నిరుద్యోగం పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రానున్న రోజుల్లో పింఛను వచ్చే అవకాశం తగ్గుతుందని తెలిపారు. పింఛన్‌దారులంతా ఒకే తాటిపై ఉండి పోరాటాలకు సిద్ధపడాలని కోరారు. అనంతరం అసోసియేషన్ ఛైర్మన్ సనపల బంగారు రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు, ప్రధాన కార్యదర్శి శివప్రకాష్‌రావు, అడ్వయిజర్ అన్నెపు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రిన్సిపల్ జూలియట్, విద్యార్థులకు బహుమతిని అందిస్తున్న రెవరెండ్ ఫాదర్ మలవరపు ప్రకాష్

బైబిల్ ఎగ్జిబిషన్‌లో 'నిర్మల'కు మూడో స్థానం

ప్రజాశక్తి-గాజువాక : బైబిల్ ఎగ్జిబిషన్ పోటీలో వడ్లపూడిలోని నిర్మల ఇంగ్లీషు మీడియం పాఠశాల మూడో స్థానంలో నిలిచిందని కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ పి.రత్నకుమార్, ప్రిన్సిపల్ సిస్టర్ జూలియట్ తెలిపారు. జ్ఞానాపురంలోని సెయింట్ జూబ్లీ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 33 పాఠశాలలు పాల్గొన్నాయని, ఈ పోటీల్లో ఒక్కో పాఠశాల ఒక్కో అంశంపై ప్రదర్శనలిచ్చాయని తెలిపారు. 'ది టవర్ ఆఫ్ బాబెల్' ప్రదర్శనకు గానూ నిర్మల ఇంగ్లీషు మీడియం పాఠశాలకు మూడో స్థానం దక్కిందని పేర్కొన్నారు. విజేతలకు ముఖ్య అతిథి రెవరెండ్ ఫాదర్ మలవరపు ప్రకాష్ బహుమతిని అందించారు. బహుమతి సాధించినందుకు కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ పి.రత్నకుమార్, ప్రిన్సిపల్ సిస్టర్ జూలియట్, పీడీ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.

సమస్యలపై చేతి వృత్తిదారుల ధర్నా

ధర్నా చేస్తున్న చేతి వృత్తిదారులు

ప్రజాశక్తి -కంచరపాలెం : సమస్యల పరిష్కారాన్ని కోరుతూ కంచరపాలెం పరిధి బాపూజీనగర్ వద్ద ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన కమిటీ అధ్యక్షులు గొలుసు నూకరాజు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తుల నుంచి వృత్తిదారులను దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల వల్ల చేతివృత్తులన్నీ ధ్వంసం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో 1.70 కోట్ల మంది వివిధ చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 56 రకాల కార్పొరేషన్లు పెట్టినప్పటికీ నిధులు లేవన్నారు. రజక, చేనేత, వడ్రంగి, దర్జీ, కంచర, కమ్మర, కుమ్మరి, మేదర, సౌర, వడ్డెర, కల్లుగీత, గొర్రెలు మేకల పెంపకం, వాల్మీకి, బోయి, తదితరులు నేడు వృత్తులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం చేతివృత్తిదారులను ఆదుకోవాలని కోరారు. వృత్తిదారుల కుటుంబాలకు రూ.25 వేల ఆర్థిక సహాయం అందించాలని, రజక వృత్తికి దోబీఘాట్లు, వృత్తి స్థలాలు కేటాయించాలని, చేనేత కార్మికులకు మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు ఉచితంగా నిర్మించి ఇవ్వాలని, కమ్మరి, వడ్రంగి, సెలూన్ వృత్తిదారులకు పనిముట్లు ఇవ్వాలని, అన్నారు. జగనన్న చేదోడు పథకం ద్వారా చేతివృత్తిదారులందరికీ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించాలని, కల్లు గీత వృత్తి అభివృద్ధికి, ఆధునికీకరణకు నిపుణులతో కమిటీ వేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో చేతివృత్తులకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈశ్వరరావు, కె.నూకరాజు, కమ్మరి వడ్రంగుల సంఘం అధ్యక్షులు కె.అప్పారావు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు దమ్ము అప్పారావు, టిటి.రాము, ఎ.అప్పారావు, వి.శ్రీనివాసరావు, బి.నాగరాజు, బి.సురేష్, వృత్తిదారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శారదాపీఠం వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : శారదాపీఠం వార్షిక మహోత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. మూడో రోజున ఆదివారం లోక కల్యాణార్థం రుద్ర హోమం, వనదుర్గా హోమం నిర్వహించారు. లక్ష మూల మంత్రాలతో చేపట్టిన రాజశ్యామల యాగం కోసం విశేష ద్రవ్యాలను వినియోగించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్ దంపతులు రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతా మూర్తుల ఆలయాలను సందర్శించి యాగంలో పాల్గొన్నారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఉత్సవాల్లో పాల్గొని పీఠాధిపతుల ఆశీస్సులు అందుకున్నారు. స్వరూపానందేంద్ర సూచనల మేరకు ద్రాక్షారామ భీమేశ్వర స్వామి సన్నిధిలో దధి (పెరుగు) నివేదన ఆరంభించామని మంత్రి చెల్లుబోయిన తెలిపారు. దీనిపై మంత్రి చొరవను స్వామీ అభినందించారు. కుండలో ఉంచిన పాలకు తోడు పెట్టి నివేదన సమర్పిస్తే విగ్రహాలు పాడవకుండా ఉంటాయని సంతోషం వ్యక్తం చేశారు. మరోపక్క టీటీడీ చేపట్టిన చతుర్వేద హవనం వేదోక్తంగా సాగుతోంది. మూడు రోజులపాటు నిర్వహించిన చాత్తాద శ్రీ వైష్ణవ ఆగమ సదస్సులు ముగిశాయి. అర్చక అకాడమీ డైరెక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి ఆధ్వర్యాన ఈ సదస్సులను నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు పీఠం తరపున ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి ప్రోత్సాహక సర్టిఫికెట్లను అందజేశారు. శ్రీకాళహస్తి ఆలయ ఇఒ సాగర్‌బాబుతో పాటు ఆలయ పండితులు పీఠానికి వచ్చి శివరాత్రి వేడుకలకు హాజరు కావాల్సిందిగా స్వాములను కోరారు.

యోగీత బిందుకు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న స్వరూపానందేంద్ర స్వామి

ఆకట్టుకున్న యోగీత బిందు నృత్య ప్రదర్శన

శ్రీ సాయి కళానికేతన్ రాగిణి కూచిపూడి నాట్య మండలి ఆధ్వర్యాన నిర్వహించిన కూచిపూడి నాట్య మయూరి యోగీత బిందు ప్రదర్శించిన నాట్యం భక్తులతో పాటు ప్రముఖులను సంభ్రమాశ్చర్యంలో ముంచెత్తించింది. భక్తులు కరతాళ ధ్వనులతో యోగీత బిందును ఆశీర్వదించారు. యోగీత బిందుకు పీఠాధిపతులు స్వరూప నందేంద్ర స్వామి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ నాట్యంలో నాట్యమండలి చిన్నారులు పాల్గొన్నారు.

జిప్సా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో జిప్సా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిప్సా అధ్యక్షులు పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ, ఫిబ్రవరిలో 10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. సంఘం ప్రతిష్ట దెబ్బతినకుండా ఉండడానికి ఐదుగురు సభ్యులతో కూడిన క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రౌడీలు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రౌడీలు క్రమశిక్షణతో మెలగాలని, ఎటువంటి వివాదాల్లోనూ తలదూర్చకూడదని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ గౌరి సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ప్రతి ఆదివారమూ స్టేషన్ పరిధిలో రౌడీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా చందనోత్సవం

ప్రజాశక్తి- కంచరపాలెం : జివిఎంసి 53వ వార్డు పరిధి డాక్టర్ జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జీద్ -ఈ -అల్ ఖాదిర్ ఆధ్వర్యాన హజ్రత్ కాజా గరీబ్ నవాజ్ చందనోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముస్లిం సోదరులు మస్జీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించారు. సాయంత్రం చిన్నారులు నాత్తే కళాములు ఆలపిస్తూ మర్రిపాలెం గ్రీన్ గార్డెన్ పార్వతి నగర్ తదితర ప్రాంతాల్లో చాదర్ (పవిత్ర వస్త్రం)తో చందనోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం దావత్ ఏర్పాటుచేశారు. చందనోత్సవ వేడుకల అనంతరం చాదర్‌ను అజ్మీర్ షరీఫ్ వద్ద హజ్రత్ కాజా గరీబ్ నవాజ్ సమాధి వద్ద సమర్పిస్తామని మస్జీద్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు మున్నా, కార్యదర్శి వల్లి, భాష, నూరి పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గాజువాక సమన్వయ కర్త జెర్రిపోతుల ముత్యాలు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో విశాఖనగర అధ్యక్షులు గొంపా గోవింద్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన ప్రజా సంపద విశాఖ ఉక్కు కర్మాగారామన్నారు. దీన్ని కాపాడటానికి కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. ఉక్కు ప్రజాగర్జనకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కాంగ్రెస్ నాయకులు కొవిరి కోదండరావు, యరబాల భూలోక, కట్టా అప్పారావు, ఎమ్.వర్మ, రామారావు, కొవిరి దేముడు, బసా రెడ్డి, ఆనంద్, రాజు, నాయుడు, సరీఫ్, ప్రసాద్, అప్పారావు అప్పలరాజు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం

91వ రోజుకు దీక్షలు : సిపిఎం నేతల సంఘీభావం

ఆందోళన చేస్తున్న మత్స్యకార నిర్వాసితులు

ప్రజాశక్తి -రాంబిల్లి : నావ్ నిర్వాసిత మత్స్యకారుల సమస్యల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం దుర్మార్గమని సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు మండిపడ్డారు. ఆదివారం నావ్ మెయిన్ గేటు వద్ద 91రోజులుగా ఎనిమిది గ్రామాల మత్స్యకార జెఎసి ఆధ్వర్యంలో సాగుతున్న దీక్షల్లో పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ, మూడునెలలకు పైగా మత్స్యకారులు తమ సమస్యల పరిష్కారానికి దీక్షలు చేస్తుంటే వాటిని పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వం, అధికారులకు లేకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారయంత్రాంగం కళ్ళు తెరిచి, మత్స్యకారుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. జిల్లా కలెక్టరేట్ చుట్టూ పలుమార్లు తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాని పరిస్థితుల్లో అవసరమైతే అమరావతి వెళ్లి ఆందోళన చేసేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు, జెఎసి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

చీరల పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న టిడిపి నేత రమణారావు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని కొత్త అచ్చర్ల గ్రామంలో సింహాద్రి అప్పన్న కోలాటం బృందం మహిళలకు అచ్చర్ల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎన్ రమణారావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పండుగలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని, ఇటువంటి ఉత్సవాల్లో స్థానికంగా ఉన్న కోలాటం బృందాల ప్రదర్శన తిలకించడం కొత్త అనుభూతినిస్తుందున్నారు. ఆసక్తి ఉన్నవారంతా కోలాటం నేర్చుకుని ప్రదర్శనల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్
అనకాపల్లి జిల్లా చైర్మన్‌గా వాసు

ప్రజాశక్తి- అనకాపల్లి : రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా చైర్మన్‌గాఅనకాపల్లి కలెక్టరేట్‌లో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌వివిఎస్ నాయుడు (వాసు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ అమరావతి జెఎసి చైర్మన్, అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం అనకాపల్లి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు దొక్కా లోవరాజు, కోశాధికారిగా అనకాపల్లి డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్మూర్తి, అసోసియేట్ చైర్మన్‌గా డి.వి. రామారావు, కో చైర్మన్‌గా దాడి దిలీప్ కుమార్, పి దుర్గాశంకర్, మైలపల్లి నాగసూరి శివ, చిటికెల జయమ్మ, కార్యదర్శులుగా కామిరెడ్డి దేవుడు, చింతాడ శ్రీనివాసరావు, బడ్డు రమేష్, కె మాధవిలత ఎన్నికయ్యారు.

త్వరలో అందుబాటులోకి
ఆర్‌టిసి బస్‌స్టేషన్
- ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

ఆధునికీకరణ పనులు చూస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి- దేవరాపల్లి: దేవరాపల్లిలో ఆధునీకరించిన ఆర్‌టిసి బస్‌స్టేషన్ అతి త్వరలో మండల ప్రజలకు అందుబాటులోకి రానుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్‌టిసి బస్‌స్టేషన్‌లో ఆధునీకరణ పనులను పరిశీలించారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఉన్న భవనాన్ని ప్రయాణికుల సౌకర్యార్థం అభివృద్ధి చేస్తున్నామని, అవసరమైన సౌకర్యాలతో భవనాన్ని మెరుగుపరుస్తున్నామని ఉపముఖ్యమంత్రికి మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు వివరించారు. కాగా దేవరాపల్లిలోని ఆర్‌టిసి బస్‌స్టేషన్ అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడే పరిస్థితి ఉండేది. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో నిధులు మంజూరై, ఆధునీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి బూడి మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం దేవరాపల్లి బస్ స్టేషన్ అతి త్వరలో అందరికీ అందుబాటులో వచ్చేలా నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న ఆధునికీకరణ పనులకు సంబంధించి కొన్ని సూచనలు చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

'కాఫీ విత్ కేడర్'లో టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి - కశింకోట : పార్టీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని విస్సన్నపేటలో'కాఫీ విత్ కేడర్' కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అఖండ విజయం, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే ప్రధాన కర్తవ్యం, లక్ష్యంగా టిడిపి శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. వైసిపి అరాచక పాలనలో రాష్ట్ర అథోగతి పాలైందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే విపక్ష నేతలు, కార్యకర్తలపై అధికారపార్టీ కేడర్ దాడులకు పాల్పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ కేడర్‌లో ఉత్తేజం, ప్రతి కార్యకర్తకూ భరోసా కల్పించడమే లక్ష్యంగాఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలంటే అది టిడిపి వల్లే సాధ్యమన్న విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాయల మురళి, సంబారు శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు చిదిరెడ్డి రమణ, చిద్ది రెడ్డి శ్రీను, ముచ్చి కొండలరావు, శ్రీను, విస్సన్నపేట గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుకండి

రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి-కశింకోట : రక్తదానంతో ప్రాణదాతలు కావాలని డూమా జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రోజారాణి అన్నారు. ఆదివారం మండలంలోని బయ్యవరం గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో, అమ్మ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన యువతీ యువకులు రక్తదానం చేయాలని, ఏడాదికి ఒకటి రెండుసార్లు రక్తదానం చేయడం ద్వారా ఎ దాతల ఆరోగ్యం మెరుగుపడడంతోపాటు ఒక యూనిట్ రక్తంతో మరో ముగ్గురి ప్రాణాలను కాపాడిన వాళ్లవుతారన్నారు. రక్తదానశిబిరంలో యాదగిరి లక్ష్మీ అనే యువతి ధైర్యంగా ముందుకొచ్చి రక్తదానం చేయడాన్ని అభినందించి ఎపిడి రోజారాణి,ఆమెను అందరూ స్ఫూర్తిగా తీసుకొని మహిళలందరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 60మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారని నిర్వాహక . స్వామి వివేకానంద యూత్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు గొల్లివిల్లి శ్రీనివాసరావు, సభ్యులు కొరుప్రోలు వెంకటేశ్వర మాస్టారు, లంక దుర్గాప్రసాద్, గొన్నాబత్తుల నానాజీ మాస్టర్, దేవర చిరంజీవి మాస్టర్, జగతా భూపతి, పాతాళ శ్రీకాంత్, సనేడ గజాలు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ చైర్మన్ బాబూరావుకు సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : జివిఎంసి విలీన గ్రామం రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను అత్యంత విజయవంతంగా నిర్వహించిన ఉత్సవకమిటీ చైర్మన్ కొణతాల బాబూరావును కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. రథసప్తమి వేడుకలకు రెండు నెలల ముందు నుంచే బాబూరావు పడ్డ శ్రమ, ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులకు ఇచ్చే సూచనలు, సలహాలతో దిగ్విజయంగా నిర్వహించ గలిగామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కర్రి కోటేశ్వరరావు, గొల్లవిల్లి రామ కోటేశ్వరరావు, రామకృష్ణ ప్రసాద్, గొల్లవిల్లి నరసింగరావు, సిద్ధిరెడ్డి నూకరాజు, బండారు వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వార్షికోత్సవంలో పాల్గొన్న టిడిపి నేత పైలా

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని మేడిచర్ల గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావుతోపాటు పలువురు నేతలు, ప్రజలు స్వామిని దర్శించుకుని, ప్రత్యేకపూజలు, మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలందరూ ఐక్యంగా ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పండగలు, తీర్థాలు సాంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని నిర్వహించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి మహేష్, ఆదిరెడ్డి వెంకటరావు, బొడ్డు కృష్ణారావు, నరసింహమూర్తి, చిన్నబాబు, సూరెడ్డి బాబూరావు, టిడిపి నాయకులు బండారు నరసింహనాయుడు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బోయిల కింతాడలో పారిశుధ్య పనులు

మురుగు కాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో గ్రామ సర్పంచ్ బూరె బాబూరావు ఆధ్వర్యంలో గ్రామంలో శుభ్రతపరిశుభ్రత కార్యక్రమం లో భాగంగా ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. మురుగు కాలువల్లోని పూడికలను తొలగించడం తోపాటు వీధులన్నీ శుభ్రంగా చెత్తాచెదారం లేకుండా చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు, ఉప సర్పంచు కోన శ్రీను, వార్డు సభ్యులు బొబ్బిలి రాము తదితరులు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం వస్తుందని, పంచాయతీ ద్వారా మురుగుకాలువలు, వీధులను శుభ్రపరిచినప్పటికీ, ప్రజల సహకారం ఉంటేనే పారిశుధ్య పరిరక్షణ సాధ్యమన్నారు. ప్రజలంతా భాగస్వాములై సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

జీడి, మామిడికి పొగ మంచు దెబ్బ

మాడి, మసిబారిపోతోన్న పూత

ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : పూత దశలో ఉన్న జీడి, మామిడి తోటలకు పొగ మంచు తీవ్ర నష్టం చేకూర్చుతోంది. దట్టంగా కురుస్తున్న పొగ మంచు వల్ల పూత మాడిపోతుంది. బుచ్చయ్యపేట మండలంలో అత్యధికంగా మెట్ట ప్రాంతాలు ఉండడంతో రైతులు జీడి, మామిడి తోటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. సుమారు 700 ఎకరాలకుపైగా జీడి, మామిడి పంట సాగవుతోంది.

మండలంలో పొట్టిదొరపాలెం, కొన్నెంపూడి, చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి, బుచ్చయ్యపేట, పోలేపల్లి, కేపీ అగ్రహారం, కొండంపూడి, మల్లం, పెదపూడి, పంగిడి తదితర గ్రామాల్లో జీడి, మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. గత 20 రోజులుగా తెల్లవారుజామున పొగ మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు పొగ మంచు వీడని పరిస్థితుల్లో దాని ప్రభావం ప్రస్తుతం జీడి, మామిడి పూతపై ఎక్కువగా ఉంటోంది. పొగమంచు దెబ్బకు జీడీ మామిడి పూతమాడి పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత ఏడాది సైతం జీడి మామిడి రైతులు వాతావరణ పరిస్థితులు అనుకూలించక తీవ్రంగా నష్టపోయారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టినా ఆశించిన దిగుబడులు రాకపోవడంతో జీడి, మామిడి తోటల పెంపకం దారులైన రైతులు తీవ్రనష్టాన్ని చవిచూశారు. ఈ ఏడాదైన పంట బాగుంటుందని భావించిన రైతులకు పొగమంచు తీరని నష్టాన్ని చేకూరుస్తోందని వాపోతున్నారు.

పొగమంచుతో పూత మాడి రాలిపోవడంతో ఒట్టిపోతున్న మామిడి చెట్లు

కళింగ కుటుంబాల ఆత్మీయ కలయిక

సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి -మాధవధార : విశాఖ జిల్లా కళింగ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక, వనభోజన కార్యక్రమం ఆదివారం మాధవధార తోటలో పేడాడ రమణికుమారి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పీకర్ తమ్మినేని సీతారాం హాజరై మాట్లాడారు. కళింగ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాల్లో సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కళింగ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయికను ఏర్పాటుచేసిన పేడాడ రమణకుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ పేడాడ తిలక్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఒబిసి ఛైర్మన్ మూల వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్, శ్రీకాకుళం జడ్పి ఛైర్మన్ పిరియా విజయ, చౌదరి బాబ్జి, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 50వ వార్డు తెలుగుదేశం అధ్యక్షులు సనపల వరప్రసాద్, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నంబాల ఈశ్వరరావు, సనపల శ్రీకాంత్, పేడాడ నరసింగరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు పైడి శ్రీనివాసరావు, సనపల రవీంద్ర భరత్, కళ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పైడి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ యువజన సమాజం మాజీ అధ్యక్షులందరినీ రమణికుమారి సత్కరించారు.

మోదకొండమ్మను దర్శించుకున్న బిసి నేతలు

మోదకొండమ్మను దర్శించుకున్న బీసీ నాయకులు

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు → **ప్రజాశక్తి -ములగాడ** : సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు పాడేరు మోదకొండమ్మ తల్లిని ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో మేల్లి రమణబాబు, తోనంగి వెంకటరమణి, బంధం పైడిరాజు, సోము నాయుడు, కోరలయ్య, కృష్ణమనాయుడు, ఉమా మహేశ్వరి, సుబ్బలక్ష్మి, సత్య, లలిత, ఆదిలక్ష్మి, ఉమ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం లోడగలవానిపాలెం పంచాయతీ పరిధిలో బుధవారం అభయాంజనేయ స్వామి 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బమ్మిడి సూర్యనారాయణ ఉమాదేవి దంపతులు, సుమారు 6000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ, అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కోలాటాలు, భజనలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బమ్మిడి సూర్యనారాయణ, బమ్మిడి ఉమ, గంటా శ్రీనివాసరావు, అక్కరమాని విజయనిర్మల, పంచకర్ల సందీప్, యరబాల అనిల్ ప్రసాద్, మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయానికి సూర్యప్రభ వాహనం

ప్రజాశక్తి-సింహాచలం: రథసప్తమిని పురస్కరించుకొని సింహాచలం దేవస్థానానికి సూర్యప్రభ వాహనాన్ని కృష్ణా జిల్లాకు చెందిన పాలడుగు కామయ్య చౌదరి అందజేశారు. ఈ వాహనాన్ని దేవస్థానం అలంకారి కర్రి సీతారామాచార్యులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నరసింహారాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు దినేష్ రాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నూర్పులు

ఖరీఫ్ ధాన్యాన్ని చక్కబెట్టే పనుల్లో రైతన్నలు బిజీబిజీ

యంత్రాల సాయంతో వరి పంటను నూర్చుతున్న రైతులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరి చేను నూర్పుడులు ముమ్మురంగా సాగుతున్నాయి. ట్రాక్టర్లతో నూర్చుతున్నారు. గతంలో పశువులు అధికంగా ఉండడంతో రైతుల తాము పండించిన వరి పంటను కుప్పలుగా పెట్టిన ప్రదేశంలోనే కల్లాలను తయారు చేసి ఎద్దులు, దున్న పోతులతో తొక్కించి నూర్పిడి చేసేవారు. అయితే వ్యవసాయ పనులలో ఉపయోగించే ఎద్దులు, దున్నలు, దూడలు తగ్గిపోయాయి. దీంతో రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చూసుకున్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ట్రాక్టర్లతో వరి పంటను నూర్చుతున్నారు. ఖరీఫ్‌లో పండించిన వరిచేనును కుప్పలుగా వేసిన రైతులు, ఇపుడు ఆయా కుప్పలను విడదీసి నూర్పిళ్ల చేస్తున్నారు. వారం పది రోజులుగా దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం, సీతయ్యపేట, పెదపూడి, గుణెంపూడి తదితర గ్రామాల్లో నూర్పిడులు జరుగుతున్నాయి. ఆయా గ్రామాలలో రైతులు వరి పంట నూర్పుడి చేసి ధాన్యాన్ని ఇంటికి తీసుకొచ్చే పనుల్లో బిజీగా ఉన్నారు.

సినీ దర్శకుడు త్రినాథ్‌కు సత్కారం

దర్శకుడు నక్కిన త్రినాథ్, జబర్దస్త్ సత్తిపండు సత్కరిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి -అనకాపల్లి : గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా సినీ దర్శకుడు నక్కిన త్రినాథ్, బుల్లితెర హాస్యనటుడు, జబర్దస్త్ సత్తిపండులను ఘనంగా సత్కరించారు. ఉత్సవాల సందర్భంగా టిడిపి బిసి సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర ఇంటి సమీపంలో హనుమాన్ యూత్, గంగ పరదేశమ్మ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేజి ప్రోగ్రామును సురేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీతలు నక్కిన త్రినాథ్, జబర్ధస్త్ సత్తిపండు మాట్లాడుతూ ఏటా జరిగే గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు తమను ఆహ్వానించడం గర్వంగా ఉందన్నారు. గతంలో ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన లక్షలాదిమందిలో తాము ఒకరిగా ఉండేవారమని, కానీ ఇపుడు తమను ప్రత్యేక వ్యక్తులుగా గౌరవించడం, సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఎల్లపు దివాకర్, మారిశెట్టి బాల, మల్ల జగప్పారావు, ఎల్లపు నూకరాజు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్లతో

వాహన రాకపోకలకు ఇక్కట్లు

చెరుకు లారీ లోడులు వెళ్లేందుకు అవస్థలు ... రైతుల కష్టాలు పట్టించుకోని అధికారులు

విద్యుత్ వైర్లు తగలడంతో నిలిచిపోయిన లారీలు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో వీధిదీపాలు, ఇంటి కనెక్షన్ల సర్వీసు వైర్లు వేలాడి ఉండడంతో వాహనరాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితుల్లో చెరుకులోడుతో వెళ్తున్న లారీలకు ఈ విద్యుత్ వైర్లు తగలడంతో ముందుకు కదలక నిలిచిపోయే పరిస్థితి ఉంది.. ఆదివారం రాజాం నుంచి ప్రయివేటు సుగర్ ఫ్యాక్టరీకి చెరుకును తరలించే లారీలు నీలకంఠాపురం గ్రామం వద్దకు వచ్చేసరికి వేలాడుతున్న విద్యుత్తు వైర్లు తగలడంతో లారీలను రోడ్డు మధ్యనే నిలిపివేశారు. వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయించి, లారీ డ్రైవర్ల వద్ద ఉన కర్రలతో వైర్లను పైకెత్తి, లారీలను ముందుకు పోనిచ్చారు. ఇదే పరిస్థితిలో కొద్దిరోజులుగా చెరకు లారీల రవాణాదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ లోడున్న లారీలతోపాటు ఓ మోస్తరు లోడుతో వెళ్లే వాహనదారులు కూడా నీలకంఠాపురంలో విద్యుత్ వైర్లతో ముందుకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై అడ్డంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయడమో, లేకుంటే తొలగించి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెరుకు రైతులు కోరుతున్నారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

మాట్లాడుతున్న ఆడమ్స్ స్కూల్ డైరెక్టర్ వెంకటరావు

ప్రజాశక్తి -చోడవరం : జాతీయ పత్రికా దినోత్సవ సందర్భంగా స్థానిక ఆడమ్స్ స్కూల్లో పాత్రికేయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆడమ్స్ స్కూల్ డైరెక్టర్ బద్రిమహంతి వెంకటరావు మాట్లాడుతూ అన్ని వృత్తుల్లోనూ పాత్రికేయరంగం ప్రత్యేకమైనది, కీలకమైనదన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సమాజంలోని రుగ్మతలను వెలికితీయడంలోనూ, సమస్యల పరిషాకరంలో పాత్రికేయులు పాత్ర మరువరానిదన్నారు. ఇటీవల కాలంలో పాత్రికేయులపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలను, అవినీతి, అక్రమాలను ఎండగట్టడంలో ప్రజల తరఫున పత్రికలు నిరంతరం పోరాడుతుండడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులను సన్మానించారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఓరుగంటి రాంబాబు, వేపాడ జోజి, పుట్టా శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, దేవరపల్లి నవ కుమార్, వేగి మహాలక్ష్మి నాయుడు, రఘు, సతీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రంగురాళ్ల తవ్వకాల సూత్రధారులపై చర్యలేవీ ?

వ్యాపారులపైనే కేసులు నమోదు - చేతులు దులుపుకున్న అటవీ శాఖ - రాజకీయ ఒత్తిళ్లతో తప్పించిన అధికారులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఆరిలోవ అటవీ ప్రాంతంలో గత నెలలో రంగురాళ్ల తవ్వకాలకు కారణమైన సూత్రధారులపై అటవీ శాఖ అధికారులు నేటి వరకు ఏ విధమైన చర్యలు చేపట్టలేదు. సూత్రధారులు ఎవరో తెలిసినప్పటికీ కొన్ని ఒత్తిళ్ళ మేరకు వారిపై అధికారులు చర్యలు చేపట్టలేదని బహిరంగంగా పలువురు విమర్శిస్తున్నారు. మొదటిరోజు తవ్వకాలు జరిగిన విషయంపై విచారణ చేసిన అటవీ అధికారులు ఇద్దరు వ్యాపారులు నలుగురు కూలీలపై కేసు నమోదు చేశారు. ఈ విచారణలో భాగంగా సాలికమల్లవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తవ్వకాలలో పాల్గొన్న వ్యక్తుల పేర్లు, తవ్వకాలకు సంబంధించిన సూత్రధారుల పేర్లను అధికారులకు తెలిపాడు. రెండవ రోజు తవ్వకాలు జరిగే సమయంలో అటవీ శాఖ అధికారిని అక్కడ ఉన్నప్పటికీ ఆమెను కొంతమంది ప్రజాప్రతినిధులు బెదిరించి తవ్వకాలు చేపట్టినట్టు విచారణలో అధికారులకు తెలిసింది రెండవ రోజు తవ్వకాలు జరగడానికి ముఖ్య సూత్రధారులైన వ్యక్తులలో కొంతమందిని అటవీ శాఖ అధికారులే తప్పించి మిగిలిన వారికి నోటీసులు ఇచ్చారు. సూత్రధారులను తప్పించడమే కాకుండా నోటీసులు ఇచ్చిన వారిని కొన్ని ఒత్తిళ్ళ మేరకు నేటి వరకు అరెస్టు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు. తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని సిసిఎఫ్ పరిశీలన సమయంలో కేసుని పక్షపాతం లేకుండా రేంజర్ లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో విచారణ చేసి కారకులైన వారందరిపై చర్యలు చేపడతామని డిఎఫ్ఓ రాజారావు తెలిపారు. అయితే రంగురాళ్లను కొనుగోలు చేసిన ఇద్దరు వ్యాపారులపై నలుగురు కూలీలపై కేసులు నమోదు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. తవ్వకాలు చేపట్టిన ముఖ్యమైన సూత్రధారులు పేర్లు తెలిసినప్పటికీ వారిపై నేటికీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వెనుక పలువురు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు అధికారులు చర్యలు చేపట్టకపోవడం వెనుక రాజకీయ ఒత్తిడి.. లేక తవ్వకాలు చేపట్టిన సూత్రధారులతో ఏమైనా ఒప్పందాలు ఉంటాయని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. స్వయానా అటవీశాఖ కావలా అధికారినిని తవ్వకాల సూత్రధారులు బెదిరించినప్పటికీ వారిపై అధికారులు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తవ్వకాలలో క్రియాశీలకంగా వ్యవహరించిన స్థానిక ప్రజాప్రతినిధులను విచారణ చేసినప్పటికీ వారిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరం.

ఇటీవల రెండు పర్యాయాలు తవ్వకాలకు సంబంధం ఉన్న వ్యక్తులను అటవీ అధికారులు నర్సీపట్నంలో విచారించినప్పటికీ నేటి వరకు చర్యలు తీసుకోలేదు. ఈ తవ్వకాలతో సంబంధం ఉన్న ప్రజాప్రతినిధులను రాజకీయ ఒత్తిళ్ల మేరకు అటవీ శాఖ అధికారులు తప్పించారని ఈ ప్రాంతంలో బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఈ విషయంపై నర్సీపట్నం అటవీ శాఖ రేంజర్ లక్ష్మీ నరసింహను వివరాల కోసం ప్రజాశక్తి ప్రాతినిధి ఫోన్లో సంప్రదించగా వివరాలను చెప్పడానికి ఇష్టపడలేదు.

చేపడుతున్న కల్వర్టు పనులు

శరవేగంగా కల్వర్టు పనులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాత కృష్ణదేవిపేటలో కల్వర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ఏడాదిలో ఈ కల్వర్టు కూలి పోయింది. ఈ కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వం రూ.22లక్షలు మంజూరు చేసినట్లు ఆర్అండ్‌బి జేఈఈ ప్రసాద్ తెలిపారు. ఈ పనులు 20 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

సచివాలయ కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏజెన్సీ లక్ష్మీపురం సర్పంచ్ లోచల సుజాత, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడులు రెండు సచివాలయాల కన్వీనర్లు, వైయస్సార్ గృహ సారథులను నియమించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎఎల్ పురం -1 సచివాలయ కన్వీనర్లుగా పెదపూడి శివ, బర్నికల చిన్నమ్ములు, బంగారు కృష్ణ లను అలాగే రెండవ సచివాలయానికి కన్వీనర్లుగా ఎంపిటీసీ చింతల బుల్లి ప్రసాద్, చిటికెల వివేకానంద నాయుడు, మువ్వల సత్యలను ఎంపిక చేసి నియమించామన్నారు. 50 కుటుంబాలకు ఇద్దరు చొప్పున మొత్తం రెండు సచివాలయాల పరిధిలో 84 మంది గృహ సారధులను నియమించామని తెలిపారు. ఈ మేరకు గొలుగొండ మండలం సచివాలయ కన్వీనర్ పాణీశాంతారంకు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణలకు వాటి వివరాలను అందజేశారు. ఎంపిక చేసిన కన్వీనర్లు, గృహ సారధులు విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బుల్లిప్రసాద్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పి.శివసత్యనారాయణ, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.



నియామక పత్రాలు ఇస్తున్న సర్పంచ్, చైర్మన్

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -రావికమతం:మండలంలోని గుమ్మాల పాడు గ్రామంలో పంట పొలాల రహదారి నిర్మాణానికి సర్పంచు బంటు సన్యాసినాయుడు శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పంచాయతీ నుంచి మూడు లక్షల రూపాయలు వెచ్చించి అప్పల రాజు చెరువు నుంచి అయ్య చెరువు వరకు పంట పొలాలకు వెళ్లే మట్టి రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. జెసిబి సహాయంతో పనులను చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బంటు విజయలక్ష్మి శ్రీను ,గ్రామ నాయకులు బంటు సత్యారావు, సన్యాసి నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో పిల్లలతో బుక్ రీడింగ్ చదివించి కథలు చెప్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజుబాబు మాట్లాడుతున్న పుస్తకాలు చదవడంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

దీక్ష విరమింప చేస్తున్న ఆర్డీవో జయరాం

ఆర్డిఒ హామీతో

జనసేన నేతల దీక్ష విరమణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:రోడ్డు మరమ్మతు చేపడతా మని ఆర్డిఓ జయరామ్ హామీ ఇవ్వడంతో జనసేన నేతలు నిరవధిక దీక్షను ఆదివారం విరమించారు. గొలుగొండ మండలం ఎర్రవరం నుండి సుమారు మూడు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి బాగు చేయాలని జనసేన నేత సూర్యచంద్ర శనివారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన ఆర్డిఓ జయరాం నెల రోజులలో రోడ్డు మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చి నిమ్మరసం అందజేసి దీక్షను విరమింప చేసారు. జనసేన నాయకులతో ఆర్డిఓ మాట్లాడుతూ, నెల రోజుల్లో రోడ్డు నిర్మాణం చేస్తానని, సోమవారం జరిగే స్పందనలో అధికారులతో సమీక్ష చేస్తానని తెలిపారు.

ఎంఆర్ఐ స్కానింగ్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక శ్రీకర్ స్కాన్ అండ్ డయాగ్నోసిస్ మెడికల్ ల్యాబ్‌లో డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో 1.5టి ఎంఆర్ఐ స్కాన్ ప్రారంభించారు. స్థానిక అధికారి గోపాలరావు హాస్పటల్‌కు ఎదురుగా శ్రీకర్ ల్యాబ్‌లో నూతనంగా నిర్మించిన భవనంలో విశాఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ అబ్బాయి చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్బాయి మాట్లాడుతూ, అధునాతన స్కానింగ్ అనకాపల్లి జిల్లాలోని మొట్ట మొదటిసారిగా నర్సీపట్నంలో ఏర్పాటు చేయడం చాలా ఆనందదాయకమని తెలిపారు. ఇకపై ఈ ప్రాంత ప్రజలు విశాఖ వెళ్లవలసిన పని లేదని తెలిపారు. డాక్టర్ మహేష్ మాట్లాడుతూ నర్సీపట్నం ప్రాంత పేద ప్రజలకు అతి తక్కువ ధరలోనే సేవలందిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, జెడ్పిటిసి సుకల రమణమ్మ, మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు రాజేష్, కోనేటి రామకృష్ణ, గొలుసు నరసింహమూర్తి, కృష్ణ సుమంత్, డా. రాజశేఖర్ డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్‌ను పరిశీలిస్తున్న వైద్యులు

రాష్ట్రంలో అన్ని వ్యవస్థలూ నిర్వీర్యం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన వీడియోలో ఈ విధంగా మాట్లాడారు. రాష్ట్రంలో పని చేస్తున్న అన్ని వ్యవస్థల ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పని ఒత్తిడితో పాటు తప్పుడు పనులు కూడా బలవంతంగా చేయిస్తు న్నారన్నారు. పోలీస్ శాఖలో ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు సిఎం జగన్ చెప్పిందే తడవుగా తప్పుడు నిర్ణయాలు తీసుకోవడంతో చెడ్డ పేరు వస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం చేసిన తప్పులను నిలదీస్తే తమపై దాడులు చేయడం, ఆస్తులు ధ్వంసం, అర్ధరాత్రులు అరెస్టు చేయడం చేస్తున్నారన్నారు. తనపై కూడా సుమారు 15 కేసులు నమోదు చేశారని విమర్శించారు. రాష్ట్ర జనాభాకు అనుగుణంగా రాష్ట్రంలో సుమారు 75 వేల మంది పోలీసులు ఉండాల్సి ఉండగా 60వేల మంది మాత్రమే ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి ఇంటి వద్ద 2వేల మంది, ఏదైనా సభకు వెళితే 3వేల మంది పోలీసులు ఉంటున్నారని తెలిపారు. మిగిలిన వారు రాష్ట్రంలో శాంతిభద్రతలను ఎలా కాపాడతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో గంజాయి, నాటుసారా, దొంగతనాలు, దోపిడీలు, అత్యాచారాలు జరుగుతు న్నాయంటే దీనికి కారణం పోలీసులు సరిపడా లేకపోవడమేనన్నారు. పోలీసులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

పోలీసుల ప్రావిడెంట్ ఫండ్‌ను కూడా పోలీసులకు తెలియకుండా రూ.800 కోట్లు వాడేశారని తెలిపారు. రాష్ట్రంలో హోంగార్డులు సుమారు 25వేలు మంది ఉంటారని, వీరికి రెగ్యులర్ చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చి మరిచారని విమర్శించారు. తెలంగాణాలో ఇస్తున్న జీతాలు కంటే రూ.1000 అదనంగా ఇస్తానని చెప్పారని, ఆ విధంగా చేయలేదన్నారు. పోలీసులతో సేవ చేయించుకొని వారిని మోసం చేయడం ఎంత వరకు సబబు అన్నారు. దీనిపై పోలీసులు ఆలోచన చేయాలన్నారు.

నగదును ఇస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల మానవత్వం

బాధితుడు నీరజ్‌కు రూ.3 లక్షల విరాళం అందజేత

ప్రజాశక్తి -కొత్తకోట:బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ వ్యాధికి గురైన కొత్తకోటకు చెందిన పదవ తరగతి విద్యార్థి గట్టెడి నీరజ్ వైద్య ఖర్చుల నిమిత్తం ఉపాధ్యాయులు సుమారు రూ.3 లక్షల నగదు సాయం అందించారు. ఈ మేరకు ఆదివారం కొత్తకోటలో విద్యార్థి నీరజ్ తల్లి నాగమణికి ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు నగదు అందజేశారు. విద్యార్థి నీరజ్ రక్తహీనత వ్యాధితో బాధ పడుతున్న విషయాన్ని ప్రజాశక్తి, పలు పత్రికల్లో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయుల సంఘం నాయకులు జిపిఎస్ నాయుడు, జి.రాంబాబు, జి.కన్నయ్యదొర, శివ, గుడాల గంగాధర్ తదితరులు మాట్లాడుతూ, మండలంలో ప్రస్తుతం విధులు నిర్వ హిస్తున్న ఉపాధ్యాయులతో పాటు గతంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సహకా రంతో సుమారు రూ.3లక్షల సమకూర్చామని పేర్కొ న్నారు. పేద విద్యార్థి నీరజ్‌కు ప్రభుత్వం తరుపున ఆరోగ్య శ్రీలో పూర్తి వైద్యం అందించేందుకు సిఎం జగన్ అంగీకారం తెలపడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. వైద్య సేవలు పొందక ముందు ఆ తర్వాత వైద్య ఖర్చుల నిమిత్తం ఈ నిధులు ఉపయోగపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి శ్రీను, గుమ్ముడు పెద్దమ్మలు, తాటికొండ రాజు, జి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం చీమల పాడు శివారు చలిసింగం గిరిజన గ్రామానికి తక్షణమే రహదారి సౌకర్యం కల్పించాలని జనసేన చోడవరం ఇన్ చార్జ్ పివిఎస్ఎన్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మూడు కిలో మీటర్ల దూరంలో కొండపై ఉన్న చలిసింగం గ్రామంలో పర్యటించారు. ఇటీవల తీవ్ర అనారోగ్యం తో మృతి చెందిన ఇరువురు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి రూ. 10 వేల నగదు సాయం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, గ్రామానికి రహదారి సౌకర్యం లేక గిరిజనుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నెల రోజుల వ్యవధి లో ఇద్దరు గిరిజన యువకులు సకాలంలో వైద్య సేవలు అందక ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. నాలుగేళ్ల కిందట రహదారి నిర్మాణానికి మంజూరైన రూ. 2 కోట్ల నిధులు ఏమి అయ్యాయని ప్రశ్నించారు. తమ పౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 150 కుటుంబాలకు మెడికల్ కార్డులు అందజేస్తున్నట్టు చెప్పారు.ఆయన వెంట మండల పార్టీ నాయకులు మైచర్ల నాయుడు, దాసరి చినబ్బాయి, మాజీ సర్పంచ్ వంజరి సత్యనారాయణ, చింతల కిషోర్ పాల్గొన్నారు.

ఎల్ఇడి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి పాయకరావుపేట: పాయకరావుపేట జాతీయ రహదారి వై.జంక్షన్ నుండి నామవరం వరకు ఎల్ఈడీ లైట్లు వేస్తున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ పాలిన అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక పాత్రికేయులతో ఆది వారం మాట్లా డుతూ. లైట్లు పని చేయంకపోవడంతో రోడ్డు యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతు న్నందున వీటిని ఏర్పాటు చేశామన్నారు.

ఏర్పాటు చేస్తున లైటు

పేరులోనే కోట..కనిపించని అభివృద్ధి బాట

-అన్ని రంగాల్లోనూ వెనుకబాటే - సమస్యల నడుమ కోటవురట్ల

బస్‌లు నిలుపు స్థలం ఇదే..

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలం అన్ని రంగాల్లోనూ వెనుకబాటే కనిపిస్తుంది. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజిక చైతన్యంలోనూ, అభివృద్ధి పథంలో ఇలా మండలం అన్ని విధాలుగా ఆమడ దూరంలో ఉండటంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా మండలంలో ఎటువంటి పరిశ్రమ లేక పోవడంతో ఉపాధి అవకాశాలు కోసం యువకులు, మహిళలు సమీప మండలాలను వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సమీప మండలం నక్కపల్లిలో హెటరో, మాకవరపాలెంలో అన్‌రాక్, అచ్చుతాపురంలో బ్రాండిక్స్, రాయవరంలో రొయ్యల ఫ్యాక్టరీ.. సహా నాతవరం, నర్సీపట్నం, వివిధ మండలాల్లో జీడి పిక్కల పరిశ్రమలకు.. వెళ్లి ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నారు

మండల వ్యాప్తంగా దాదాపు 95శాతం రైతులు సన్న చిన్న కారు రైతులు కావడంతో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో పాడి పరిశ్రమపై ఆధారపడి అధికంగా జీవనం సాగిస్తున్నారు. మండలంలో ప్రధాన నీటి వనరు వరహా, సర్ప నదులు, తాండవ జలాశయం వాటి నుంచి పంట కాలువలకు కొంతమేర నీరు అందుతుంది. దీంతో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండటంతో అధిక శాతం వ్యవసాయ బోర్లపై ఆధారపడి సాగు చేస్తుంటారు. తాండవ జలాశయం నుండి కాలువలు ఉన్నా నీరు కొంత ప్రాంతం వరకే వస్తూ ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సమీపంలో ఏటికొప్పాక చక్కెర కర్మాగారం ఉండేది. రైతులు చెరుకు సాగు చేసేవారు. కొంతమంది కార్మికులు కూడా అక్కడ పని చేయడానికి వెళ్లేవారు. ప్రస్తుతం కర్మాగారం మూతబడింది.

సామాజికంగా చూస్తే మండల వ్యాప్తంగా బీసీ కులాల వారు అధికంగా ఉండగా, తర్వాత స్థానం కాపులు ఎక్కువ కాగా, తర్వాత షెడ్యూల్ కులాల వారు అధికంగా ఉంటారు. ప్రస్తుత రాజకీయాల్లో ఆర్థికంగా బలపడిన వ్యక్తులకే పార్టీలు ప్రత్యేక గుర్తింపునివ్వడంతో నాయకత్వ లోపం కూడా మండల వ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తుంది. దీంతో ఆర్థికంగా బలపడిన వ్యక్తులు ఇక్కడ రాజకీయ చక్రం తిప్పుతూ ఉండటం గమనార్హం.

ఇకపోతే..మండలంలో తహసిల్దార్ కార్యాలయం, ఉప ఖజానా కార్యాలయం శిధిలావస్థకు చేరుకున్నాయి. వర్షం వస్తే కారిపోవడంతో ఇటీవల ఉపఖజానా కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. మండల కేంద్రంలో ఆర్టీసీ బస్ స్టేషన్ వృధాగా ఉంది. అంతేకాకుండా ప్రధాన కూడలి వద్ద గల బస్సు షెల్టర్, మరుగు దొడ్ల స్థలాలు ఆక్రమణకు గురికావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే

మధ్యలోనే నిలిచిన వంతెన పనులు

నీరు లేని కాలువ

ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో గిరిజన గ్రామాలకు సక్రమంగా రవాణా సౌకర్యం, రోడ్డు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. అనుకు, అలుముయ్యపాలెం, కోదండరామపురం, జగంపేట శివారు తడపత్రి తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం, రోడ్డు మార్గం లేదు. అదేవిధంగా చాలా గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా తయారవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఇకపోతే ప్రధాన సమస్య జల్లూరు, పందూరు, అసంపూర్తి వంతెనలు కళ్లెదుట సాక్షాత్కరిస్తున్నా పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు. గత ప్రభుత్వంలో నిర్మించి అసంపూర్తిగా వదిలి వేయడంతో శిథిలావస్థకు చేరుకున్న వంతెనలు పట్టించుకోకపోవడం పట్ల స్థానిక అధికార ప్రతిపక్ష నాయకులు సైతం తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. మండల కేంద్రంలో సామాజిక ఆసుపత్రి 50 పడకలతో ఉన్నా సక్రమంగా వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సిబ్బంది స్థానికంగా నివాసం లేకపోవడం, రోగులకు ఆహారం, తాగునీరు అందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది.

కొత్త యల్లవరంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్త యల్లవరం గ్రామంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నర్సీపట్నం కృష్ణగుప్త పిల్లలు, ఛాతీ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం పిల్లల, ఛాతీ, ఊపిరితిత్తుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వై.కృష్ణమనోజ్, చెస్ట్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ పి.మౌనికలు పిల్లల వ్యాధులకు, బిపి, సుగర్, ఆస్తమా(ఉబ్బసం), క్షయ తదితర శ్వాసకోశ వ్యాధులకు చికిత్స అందించారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది వరకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

2న బహిరంగ వేలం పాట

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని దార మఠంలో దారమల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవం సందర్భంగా ఫిబ్రవరి 18 నుంచి 20వ తేదీ వరకు స్వామివారికి భక్తులు సమర్పించే తలనీలాల హక్కు, సైకిల్ స్టాండ్ ఆశీల వసూలుకు, కొబ్బరి ముక్కలు తీసుకొనే హక్కునకు దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఫిబ్రవరి 2న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఒ బివిఎస్ఎస్.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు దేవస్థానం వద్ద వేలంపాట నిర్వహిస్తారన్నారు. పాటలో పాల్గొను పాటదారుడు ముందు ధరావత్తు సొమ్ము రూ.10వేలు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. పాట ఖరారు చేసిన వెంటనే హెచ్చుపాటదారుడు ప్రథమ ధరావత్తుతో కలుపుకొని మొత్తం సొమ్ము వెంటనే చెల్లించాలన్నారు.

శిక్షణ ఇస్తున్న సిఆర్‌పి రామారావు

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం టి. అర్జాపురం క్లస్టర్ సిఆర్‌పి గుంటూరు రామారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణా తరగతులు ఆదివారం ముగిసాయి. సిఆర్‌పి రామారావు ఆధ్వర్యంలో గత వంద రోజులుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం విద్యార్థులకు నమూనా పరీక్ష, ఓఎంఆర్ నింపే విధానం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, గణితంలో సమయ పాలన పాటించి పరీక్షను పూర్తి చేసే విధంగా అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

423వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా ఆదివారం నాటికి 423వ రోజులకు చేరింది. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ, తమ జీవన విధానానికి నష్టం చేకూర్చే పైపులైను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే కంపెనీ కాలుష్యం కారణంగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వేట సాగకపోవడంతో అనేక మంది మత్స్యకార కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస పోవడం జరిగిందన్నారు. ఇప్పటికే పాత పైప్ లైన్ ద్వారా కంపెనీ వ్యర్థ జలాలు సముద్రంలోకి విడిచి పెట్టడంతో మత్స్య సంపద నశించి వేట సాగక ,పూట గడవక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.కొత్తగా మరో పైప్ లైన్ వేసి వ్యర్థ జలాలను సముద్రంలోకి వదిలితే ఈ ప్రాంతంలో ఉండలేని పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వెలిబుచ్చారు. 423 రోజుల నుండి పైప్ లైన్ కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నప్పటికీ నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పైప్ లైన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు చేపల సోమేశ్, కాశీరావు, మైలపల్లి బాబ్జి, పిక్కి రాజు, పిక్కి తాతాజీ, చౌడేపల్లి రాజు, మైలపల్లి శివాజీ, కొత్వాల కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ఎన్‌టిఆర్ స్టేడియంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - నర్సీపట్నం రూరల్:నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం ఇంటర్ డిస్ట్రిక్స్ డోజో పోటీలు నిర్వహించారు. బాక్సింగ్, వూష, థైకొండోలో నింజాస్ అకాడమీ ఆధ్వర్యాన ఈ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీలకు రాజమండ్రి, తుని, గాజువాక, గొలుగొండ, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా పిడిలను ఘనంగా సత్కరించినట్లు సీనియర్ కోచ్ శేఖర్, బాక్సింగ్ రిఫరీ కోచ్ మౌనిక తెలిపారు. ఈ సెలక్షన్స్ ప్రథమ స్థానంలో నర్సీపట్నం, ద్వితీయ స్థానంలో రాజమండ్రి క్రీడాకారులు నిలిచారు. ఈ కార్యక్రమంలో నింజాస్ అకాడమీ డైరెక్టర్లు, ప్రముఖ సైకాలజిస్ట్ సుమ, రమ, ప్రముఖ వ్యాపారవేత్త నారాయణరావు పాల్గొన్నారు.